క్లుప్తంగా

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన



పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: మండల పరిధిలోని పటవల పంచాయతీ శివారు శాంతిమూల గ్రామంలో తాగునీటి పైపులైన్ నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత బుధవారం శంకుస్థాపన చేసారు. సుమారు రూ.28 లక్షల మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో శాంతిమూల నుంచి పటవల వరకు చేపట్టనున్న ఈ పైపులైన్ నిర్మాణానికి ఎంపీపీ సునీత భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్థాని రామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.సుకీర్తి, కూటమి నాయకులు రాయుడు గంగాధర్, నడింపల్లి వినోద్, వాడ్రేవు వీరబాబు, కొత్తూరు కాశీ ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



అయినాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై జ్వాలా సాగర్, గ్రామస్తులు

ముమ్మిడివరం: యువత పెడదోవ పట్టకుండా సన్మార్గంలో నడవాలని, తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై డి.జ్వాలాసాగర్ సూచించారు. మండలంలో అయినాపురంలో బుధవారం మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను తరచూ పర్యవేక్షించాలన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛ సంఘటనలు జరిగినా గంజాయి, డ్రగ్స్ వంటి కార్యకలాపాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల అంజిబాబు, బొంతు నాగరాజు, ఇందుకూరి పాండురంగరాజు, మట్టా సత్తిబాబు, కోరసిక రాము సబ్బతి డేవిడ్‌రాజు, బొక్కా ధర్మారావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి



ఆదిద్రావిడ వెల్ఫేర్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్

యానాం: పుదుచ్చేరి ఆది ద్రావిడ వెల్ఫేర్, షెడ్యూలు ట్రైబ్స్ వెల్ఫేర్ డైరెక్టర్ అర్జున్ రామకృష్ణన్‌ను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ బుధవారం కలిసారు. యానాంలో ఆదిద్రావిడ శాఖలో ఉన్న పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా నెల రోజుల క్రితం గవర్నర్ ఆదేశాల మేరకు జీవో 5పై సవరణ చేయాలని కోరామని, ఈ అంశంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. యానాంలోని దళిత కుటుంబాలు నూతన గృహ నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. యానాం నుంచి ఎంతోమంది విద్యార్థులు పుదుచ్చేరిలో చదువుకోవడానికి వెళుతున్నారని, వారిలో పేద వారికి షెడ్యూల్ హాస్టల్‌లో సీట్లు కేటాయించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



భట్లపాలెంలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ రామారావు

అమలాపురం రూరల్: మండలంలో భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవా భావం కలిగి ఉండాలన్నారు. అంతే కాకుండా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్ మదన్, డిప్లొమా ప్రిన్సిపాల్ ఫణి శంకర్, వివిధ విభాగాధిపతులు, లైబ్రేరియన్ ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ కె.రవి సుధీర్, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ కళాశాలల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌గా 'వెన్నపు'

పి.గన్నవరం: తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖలో అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌గా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేటకు చెందిన ప్రొఫెసర్ వెన్నపు రాజేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. రాజేంద్రప్రసాద్‌ను పలువురు స్థానికులు తదితరులు అభినందించారు.

ప్రకృతి ఒడిలో పర్యాటకుల సందడి

- మడ అడవుల్లో చిన్నారుల ఆటా పాటా
- దసరా సెలవుల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- పర్యాటకులను అలరిస్తున్న బోటు షికారు



కోరంగి అభయారణ్యం స్వాగత ద్వారం వద్ద పర్యాటకుల సందడి

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరంగి అభయారణ్యం సందర్శకుల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దసరా సెలవుల నేపథ్యంలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆట పాటలతో సరదాగా గడిపేందుకు అభయారణ్యానికి తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో సందర్శకులను మరింత ఆకర్షించడంతోపాటు, వినోదాన్ని పంచేవిధంగా అటవీశాఖ మరిన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రత్యేక సౌకర్యాలతో పర్యాటక ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా రంగురంగుల చిత్రాలను వేసారు. ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ప్రకృతి ఒడిలో మడ చెట్ల నడుమ చల్లటి ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా గడపడం పర్యాటకులకు మరచిపోలేని అనుభూతినిస్తుంది. సందర్శకుల కోసం తాగునీరు, తినుబండారాలు, శీతల పానీయాల దుకాణాలను కూడా ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్, మత్స్య, పక్షిజాతులను వీక్షించే విధంగా అక్వేరియం, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే విధంగా ప్రకృతి స్టాల్స్‌ను ఏర్పాటు చేసారు.

అలరించనున్న బోటు షికారు... క్రీక్ విజిట్‌లు

పర్యాటకులకు బోటు షికారు ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడి నుంచి మడ అడవుల అందాలతో పాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీకు (పిల్లకాలువలు)ల్లో పర్యాటకులు బోట్లపై సందర్శించే విధంగా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

సురక్షితమైన బోటు షికారు



సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించే విధంగా అభయారణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పిల్లలను ఆకట్టుకునే విధంగా పలు రకాల బొమ్మలు ఏర్పాటు చేశాం. పాడైపోయిన చెక్కల వంతెనల స్థానంలో కొత్తవి చేస్తున్నాం. ముఖ్యంగా గోదావరిలో సురక్షితమైన బోటు షికారుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. పోర్టు అధికారుల అనుమతులు, నిబంధనల మేరకు బోటు షికారు నిర్వహిస్తున్నాము. అభయారణ్యం సందర్శనం మరింత అనుభూతినిచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, కోరంగి అభయారణ్యం



ఉర్రూతలూగించే బోటు షికారు



అభయారణ్యంలో ఏర్పాటు చేసిన పలు రకాల బొమ్మలు

ఏకపక్షంగా మ్యాచింగ్ గ్రాంట్ల మంజూరుపై నిరసన

- సమావేశం నుంచి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుల వాకౌట్



సర్వ సభ్య సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

అల్లవరం: ఉపాధి హామీ పథకం మ్యాచింగ్ గ్రాంట్లు సామంతకుర్రు గ్రామానికి ఐదు పనులు నిమిత్తం ఏకంగా రూ.1.17 కోట్ల నిధులను ఏకపక్షంగా కేటాయించిన తీరుపై నిరసనగా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన అల్లవరం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై అధికారులు వివరణ ఇస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు వైస్ ఎంపీపీ వడ్డి గంగ, గుబ్బల రంగనాథస్వామి, పులుసుగంటి రాజేశ్వరి, దొమ్మేటి శ్రీశాంతిభవాని, మాకే కృష్ణమూర్తి, జనసేన ఎంపీటీసీ తిక్కా శేషుబాబు సభలో నిరసన తెలిపారు. వీరికి టీడీపీ ఎంపీటీసీలు మద్దతు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మ్యాచింగ్ గ్రాంట్లు ఒక గ్రామానికే ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. రూ.2 లక్షల గ్రాంట్ కోసం ఆరు నెలలుగా అడుగుతున్నా మంజూరు చేయడం లేదని ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు. మ్యాచింగ్ గ్రాంట్‌లన్నీ పెత్తందార్ల పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణానికి మంజూరు చేశారని తెలిపారు. రెండేళ్లుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవం, గౌరవ వేతనం లేదని మండిపడ్డారు. కనీసం ఎంపీటీసీ సభ్యులకు టీఏ, డీఏ బిల్లులు కూడా ఇవ్వడం లేదని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మ్యాచింగ్ గ్రాంట్‌లను ఎమ్మెల్యే ఆనందరావు మంజూరు చేశారని వివరణ ఇచ్చారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, దాకారపు చిరంజీవిరావు, రాయుడు విష్ణు, తిక్కిరెడ్డి శ్రీను, మల్లాడి మంగాయమ్మ, తోట శ్రీదేవి, ఎంపీడీఓ గౌరికుమారి, తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక సమావేశంలో నాయకులు

అమలాపురం టౌన్: తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం, అమలాపురం కోఆర్డినేటర్లు పొన్నాడ సతీష్‌కుమార్, పినిపే శ్రీకాంత్, చెల్లుబోయిన శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు పలు అంశాలపై చర్చించారు.

అన్ని వసతులతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల



డిగ్రీ కళాశాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అమలాపురం మండలంపేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని రకాల వసతులతో సౌకర్యవంతంగా నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజినీర్లు ఈఎస్ఎస్ కంపెనీ ఆర్కిటెక్స్ కార్తిక్‌సాయి, కాంట్రాక్టర్ యాదగిరి, పంచాయతీ రాజ్ డివిజనల్ ఇంజినీర్ పీఎస్ రాజకుమార్‌లతో భవన నిర్మాణ అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. మ్యాపులను భవన నిర్మాణ ప్లాన్ డ్రాయింగ్ విధానం మ్యాపులు, సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను(డీపీఆర్) పరిశీలించి ఆమోదాన్ని కలెక్టర్ తెలిపారు. ప్లాన్ చాలా చక్కగా అన్ని వసతులతో రూపొందించారని అదే స్థాయిలో డీపీఆర్‌లు రూపకల్పన చేశారన్నారు. ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్ల సీఎస్సార్ నిధులతో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.

మైదానం కాదు పంట కాలువే..



ఉప్పలగుప్తంలో తూడుతో పచ్చని మైదానాన్ని తలపిస్తున్న అయినాపురం సెక్షన్ పంటకాలువ

ఉప్పలగుప్తం: పచ్చటి తీగలతో అల్లుకుని ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూసి పచ్చటి మైదానం అనుకుంటే పొరపాటే. అయినాపురం నుంచి పేరాయి చెరువు వరకూ విస్తరించి ఉన్న అయినాపురం సెక్షన్ పంట కాలువ పరిస్థితి ఇది. ఉప్పలగుప్తం గ్రామంలో తూడు, పూడికలు అల్లుకుపోయి పచ్చటి మైదానంలా కనిపిస్తూ ఉంది. దీంతో నీరు దిగువకు పారక ప్రజల నిత్యావసరాలకు, పశువుల దాహార్తికి స్వచ్ఛమైన నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో నీటి సంఘాల అధ్యక్షులు లేకపోవడంతో అధికారులు కాలువల్లో పూడికలు తొలగించే నిర్ణయాలు తీసుకునేవారని, ప్రస్తుతం ప్రభుత్వం కాలువలకు నీటి సంఘాల అధ్యక్షులను నియమించినా కేవలం వారి పదవులు అలంకారప్రాయమే తప్ప క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పూడికలను తొలగించి సాగునీరుకు ఆటంకం లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నపూర్ణమ్మగా జగన్మాత

అమలాపురం టౌన్: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం, కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణదుర్గ ఆలయాల్లో అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే స్థానిక కామాక్షీ పీఠంలోని కామాక్షీదేవి కూడా అన్నపూర్ణదేవిగా అలంకృతమయ్యారు. అమ్మవార్ల ఆలయాల వద్ద నిత్యం హోమాలు, కుంకుమ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్లను మహిళా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఈదరపల్లిలో..

అమలాపురం రూరల్: అమలాపురం ఈదరపల్లి వంతెన వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో వెలసిన దుర్గాభవాని అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు ప్రసాద వితరణ చేశారు.

సన్నవిల్లిలో..

ఉప్పలగుప్తం: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారికి బుధవారం ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని సన్నవిల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నపూర్ణదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధ వారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు, రాజుపాలెం, గోదశివారి పాలెం, క్రాపచింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, చినకొత్తలంక, పల్లవారిపాలెం, లక్ష్మీదేవి లంక, మార్కెట్ సెంటర్ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అన్నపూర్ణా దేవి అలంకరణలో కనకదుర్గమ్మ

తాళ్లరేవు: కోరంగి శ్రీ దుర్గా మల్లేశ్వర పంచాయతన ఆలయంలో బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసారు.



అన్నపూర్ణాదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



చినకొత్తలంకలో అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా కామాక్షి అమ్మవారు



సన్నవిల్లిలో..



బండారులంకలో..

అంబేడ్కర్‌కు అవమానం

ఐ.పోలవరం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆంధ్ర రాష్ట్ర సాధకుడు పొట్టి శ్రీరాములకు ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌లో అవమానం జరిగిందని టి.కొత్తపల్లి మాల మహానాడు ప్రతినిధులు ఆరోపించారు. పోలీస్ స్టేషన్‌లో అంబేడ్కర్, శ్రీరాముల చిత్రపటాలను కిటికీకి వేలాడదీసి వారిని అవమానించారని, ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని, ఇది అత్యంత హేయమైన చర్య అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను, ఒడ్డి గౌతం, మట్ట గగన వీరుడు, మొలపర్తి శ్రీను, కాశి ధర్మేంద్ర, సాధనాల బాబురావు, మాదేటి పండు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

తాళ్లరేవు: మహిళ ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం మండల పరిధిలోని పటవల, సుంకరపాలెం, గాడిమొగ, తాళ్లరేవు గ్రామ పంచాయతీల్లో ప్రధాన మంత్రి స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పటవలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా దేశంలోని మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు జయభార్గవి, ఈశ్వర్, లావణ్య మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమ మండల కన్వీనర్ చెక్కా అజయ్‌వర్మ, కో కన్వీనర్ ఇనమండ్ర విజయ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

బండారులంకలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి గౌతమి

అమలాపురం రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత అన్నారు అన్నారు. బండారులంక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్యవంతమైన మహిళ–శక్తివంతమైన కుటుంబం వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య అధికారులు గౌతమి, అన్నామని ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు ఉచితంగా కొన్ని రకాల టెస్టులు క్యాన్సర్, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చింతా శంకరమూర్తి, కొండరాజు, కాశిన బాబి, చింతపట్ల మోహన్, మల్లవరపు ఏడుకొండలు, వాసా భీమశంకర, గ్రామ సచివాలయం కార్యదర్శి కె.శ్రీనివాస్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడకు బయలుదేరిన బీఎస్పీ నాయకులు



అమలాపురం నుంచి విజయవాడకు బయలుదేరుతున్న బీఎస్పీ నాయకులు

అమలాపురం టౌన్: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహిస్తున్న దళిత రణభేరి సభకు అమలాపురం నుంచి పార్టీ నాయకులు వెళ్లారు. చలో విజయవాడ కార్యక్రమానికి అమలాపురం పట్టణం ఈదరపల్లి వంతెన వద్ద నుంచి ప్రత్యేక బస్సులో పార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు, అధ్యక్షుడు ప్రతాప్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిత్తుక సత్యనారాయణ, కార్యదర్శి కోనాల ప్రకాశం, పార్టీ నాయకులు జీడీఎస్ రాజు, చంద్రరావు, ఏడుకొండలు తదితరులు విజయవాడ వెళ్లారు. బయలుదేరే ముందు వారు దళిత రణభేరి విజయవంతం కావాలని నినాదాలు చేశారు.

ఓటర్ల పరిశీలన సమగ్రంగా చేయాలి

అంబాజీపేట: మండలంలో ఉన్న ఓటర్ జాబితాను పురస్కరించుకొని పరిశీలన సమగ్రంగా చేయాలని బీఎల్వోలకు తహసీల్దార్ బి.చిన్నబాబు సూచించారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆర్ఐ కె.ఏడుకొండలు అధ్యక్షతన మండల బీఎల్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2002, 2025 ఓటర్ల జాబితాలను పరిశీలించి ఓటర్లను గుర్తించాలన్నారు. ఓటర్ల పునఃపరిశీలనపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తహసీల్దార్ సూచించారు.